వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణోత్సవం


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.8,37,062 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఆలేరును సస్యశ్యామలం చేస్తాం

• ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు పెద్ద వాగులో ప్రవహించే గోదావరి జలాలకు పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 30 : ఆలేరుకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు పెద్ద వాగులో ప్రవహించే గోదావరి జలాలకు సోమవారం చీరె, సారె సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నుంచి నీరు విడుదల కావడంలో ఆలేరులోని దుర్గమ్మ ఆలయం చెంతకు గోదావరి జలాలు చేరగా పూజలు చేశామన్నారు. తపాస్‌పల్లి నుంచి కుర్రారం, బొందుగుల, కొలనుపాక గ్రామాల చెరువులను నింపామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సహకారంతో గోదావరి నీళ్లు తీసుకొచ్చి నియోజకవర్గ రైతుల కాళ్లు కడుగుతున్నామని చెప్పారు. ప్రజలకు నష్టం జరుగకుండా 1.4 టీఎంసీతో గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైత్యమహేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, నాయకులు ఎజాస్, వెంకటేశ్వర్లు, అశోక్, పద్మ, భాస్కర్, శ్రవణ్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

మల్లాపురం, సైదాపురం చెరువుల సందర్శన

మోటకొండూర్ : మండలంలోని మల్లాపురం, సైదాపురం చెరువులు, కాల్వలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సోమవారం సందర్శించారు. మల్లన్న సాగర్ నుంచి గండి చెరువు, సైదాపురం చెరువుకు నీళ్లు విడిచిపెట్టాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. గండి చెరువుకు వెళ్లే కాల్వ నుంచి సైదాపురం గ్రామానికి వెళ్లేందుకు మరో కాల్వను ఏర్పాటు చేసి చెరువును నింపాలని అధికారులకు సూచించారు. అనంతరం సైదాపురం వీరభద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. మల్లాపూరం గ్రామానికి వచ్చే కాల్వ వద్ద కూడా పూజలు చేశారు.

గ్రంథాలయ భవన నిర్మాణం కోసం వినతి

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన రాఘవాభారతి గ్రంథాలయానికి శాశ్వత భవనం కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామ యువకులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ గ్రంథాలయ నిర్మాణం కోసం సహకారం అందిస్తానన్నారు. తిరుమలేశ్, రమేశ్, వెంకటేశ్, శ్రావణ్, మహేశ్, నహీం, ప్రశాంత్ ఉన్నారు.

సాగునీటి కాల్వల అభివృద్ధే సర్కారు లక్ష్యం

• భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

అక్కాచెల్లెల చెరువు వద్ద నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి భీమలింగం కాల్వ తూములను పరిశీలిస్తున్న ఎమ్మెలే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, సెప్టెంబర్ 30 : చిన్న నీటిపారుదల కాల్వలను అభివృద్ధి చేసి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంగెం, పొద్దటూర్, ఎదుళ్లగూడెం, నాతాళ్లగూడెం, వలిగొండ, వెల్వర్తి, వెంకటాపురం, చిత్తాపురం గ్రామాల రైతులకు సాగునీరందించే బునాదిగాని, భీమలింగం, ధర్మారెడ్డిపల్లి కాల్వలను నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం కాల్వల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.450 కోట్లు మంజూరు చేయించానన్నారు. కాల్వల మరమ్మతులు, చెరువుల తూములు, కల్వర్టుల నిర్మాణం, కాల్వ కట్టల పునర్నిర్మాణ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందిస్తామని చెప్పారు. మండల కేంద్రంలోని అక్కాచెల్లెల చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. బునాదిగాని కాల్వకు ముగ్దంపల్లి దగ్గర గండి పడి నీరంతా వృథాగా పోతుందని పేర్కొన్నారు. గండిని యుద్ధప్రాతిపదికన కాంక్రీట్ చేయించి బునాదిగాని చెరువును నింపుతామని తెలిపారు. మండల పరిధిలో ప్రవహించే మూసీ నీటితో మండలంలోని చెరువులను నింపి రైతులకు సాగునీందిస్తామని చెప్పారు. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా హైడ్రా ద్వారా మూసీ ఆక్రమణల తొలగింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ట్రిపుల్ ఆర్ బాధితులు, భూములు కోల్పోతున్న రైతులు అధైర్య పడొద్దని, ముఖ్యమంత్రిని, మంత్రిని కలిసి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డీఈలు లావణ్య, శాంతి, దివ్య, కిరణ్మయి, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాశం సత్తిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్ పాపిరెడ్డి, నరేశ్‌రెడ్డి, జంగారెడ్డి, సహదేవ్, లింగస్వామి, నాగేశ్వర్, వెంకటేశం, సతీశ్ పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడే బాధ్యత అధికారులదే

• ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు తిరుమలేశ్

కొండగడపలో అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు తిరుమలేశ్

మోత్కూరు, సెప్టెంబర్ 30 : గ్రామాల్లో దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని, వారి హక్కులను కాపాడే బాధ్యత అధికారులపైన ఉన్నదని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేశ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొండగడపలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు, వారి హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, ప్రజా కార్యక్రమాల్లో దళిత ప్రజా ప్రతినిధులను పనిమనుషులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. మెదక్ జిల్లాలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకుండా అవమానపర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలపై పోలీస్, రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. అంతకుముందు తాసీల్దార్ రాంప్రసాద్, ఎస్ఐ డి.నాగరాజు దళిత చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎర్రవెల్లి మల్లమ్మ, ఎస్సీ సంక్షేమాధికారి రాజాలుబాయి, ఎంఆర్ఐ జె.సుమన్, దళిత సంఘాల నాయకులు తొంట భాస్కర్, ఎర్రవెల్లి యాదయ్య, నరేశ్, నవీన్, అయిలుమల్లు, పరశురాములు, నరేందర్, మధు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 30 : మండలంలో సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మందళ్లగూడెం గ్రామంలోని నర్సింహారెడ్డి పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేసే కూలీలు చౌటుప్పల్‌లో నిత్యావసర వస్తువులు కొనేందుకు సోమవారం ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. మందళ్లగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ అభినందన్‌రెడ్డి ట్రాక్టర్‌ను అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడంతో లింగారెడ్డిగూడెం వద్ద అదుపు తప్పింది. దాంతో ముందు కూర్చున్న ఏపీలోని విజయనగరం జిల్లా గంగడ గ్రామానికి చెందిన గుండ్ల గణేశ్(40) కిందపడగా.. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు..

చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు బైక్‌పై ముగ్గురు వ్యక్తులు సోమవారం వెళ్తుండగా మల్కాపురం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రం పలసబాని గ్రామానికి చెందిన రాజుకిశోర్ (39), గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన బసోటాబాగుడి (21) మృతిచెందారు. జార్ఖండ్ రాష్ట్రం పాలెం గ్రామానికి చెందిన మనీశ్‌కుమార్‌వర్మ (23)కు గాయాలయ్యాయి. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అడ్డగూడూరు, సెప్టెంబర్ 30 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండలంలోని అజీంపేట గ్రామానికి చెందిన వెంకటేశ్ అనుమతులు లేకుండా మూసీ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.65వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ పట్టణానికి చెందిన గుడికందుల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన గుడికందుల శ్రీధర్ బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ పరిధిలో డబ్బు కోసం ఓ వ్యక్తిని హత్య చేశారు. కేసు విచారణ చేపట్టిన బొమ్మలరామారం పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేయగా.. వారికి సోమవారం కోర్టు శిక్ష విధించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : భువనగిరి పట్టణంలోని పలు కాలనీల్లో మంగళవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వినయ్‌కృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల వరకు, పాత బస్టాండ్ నుంచి న్యూ వివేరా హోటల్ వరకు 11 కేవీ లైన్ నిర్వహణ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా గాంధీ పార్కు నుంచి ఆర్బీనగర్, సంతోష్‌నగర్, పెంటోజినగర్, శృతినగర్, సస్తాబజార్, ఠాగూర్ రోడ్, సంజీవయ్యనగర్, హనుమాన్‌వాడ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

'హై టెన్షన్ టవర్లకు విద్యుత్ వైర్లు బిగించాలి'

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : పట్టణ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన హై టెన్షన్ టవర్లకు విద్యుత్ వైర్లు బిగించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హై టెన్షన్ టవర్ల పక్కన సిమెంట్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వాటి నుంచి వైర్లను తొలగించి హై టెన్షన్ టవర్లకు విద్యుత్ వైర్లు బిగించాలని కోరారు. తాతానగర్, బంజారాహిల్స్, ఓంకార్‌నగర్, పహాడీనగర్ కాలనీల్లో ఇండ్ల పైనుంచి వెళ్తున్న వైర్లను తొలగించాలన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొలుపుల అమరేందర్, తాడెం రాజశేఖర్, చెన్న మహేశ్, గుర్రాల శ్రీశైలం, పెంట నితిన్, నాగారం సూరజ్ పాల్గొన్నారు.

రోగులు ఆత్మస్థైర్యంతో ఉండాలి : ఏసీపీ మధుసూదన్

చౌటుప్పల్‌లో జరిగిన కండరాల క్షీణతా మాసోత్సవాల కార్యక్రమంలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న చౌటుప్పల్ ఏసిపి మధుసూధన్‌రెడ్డి.

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 30 : కండరాల క్షీణత బాధితులు ఆత్మస్థైర్యంతో ఉండాలని ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కండరాల క్షీణత వ్యాధి అవగాహన మాసం సందర్భంగా సీనియర్ డిజేబులిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రోగులకు ఆయన స్వీయ ఖర్చులతో నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ, పోలీస్ బృందం పాల్గొన్నారు.

24గంటలు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యేకు వినతి

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపేదలకు 24 గంటలు వైద్య సేవలు అందించే విధంగా చూడాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్ సోమవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌సీలో వైద్యాధికారుల నిర్లక్ష్యంతో పేదలకు వైద్యసేవలు అందడం లేదన్నారు. మందులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిర్లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిని ప్రక్షాళన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుద్దాల సాయికుమార్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించడంలో పౌరసంబంధాల పాత్ర కీలకం

• కలెక్టర్ హనుమంతు కె.జెండగే

జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో పబ్లిక్ రిలేషన్స్ పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా పౌరసంబంధాల అధికారి పి.వెంకటేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడంలో, వాటి ప్రాముఖ్యతను తెలియజెప్పడంలో పబ్లిక్ రిలేషన్స్ పాత్ర ఎనలేనిదన్నారు. జిల్లా యంత్రాగంతో, మీడియాతో అనుసంధానంగా ఉండి తన బాధ్యతను జిల్లా పౌరసంబంధాల అధికారి పి.వెంకటేశ్వర్‌రావు నిర్విఘ్నంగా నెరవేర్చారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగులు క్షేత్రస్థాయి నుంచి అద్వితీయ పాత్ర పోషిస్తూ జిల్లాను ముందంజలో నిలుపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి, రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ట్రెజరర్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ కోసం కృషి : ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్

సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు

మోత్కూరు, సెప్టెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ సంఘంలోని రైతులందరికీ వర్తించడం కోసం కృషి చేస్తానని మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సహకార సంఘం భవనంలో సోమవారం ఆయన అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీర్ఘకాలిక అప్పులు తీసుకొని వాయిదా మీరినా అప్పుదారులకు ఓటీఎస్ ద్వారా తగ్గించి పంట రుణాలుగా మార్చాలని డీసీసీబీని కోరినట్లు తెలిపారు. యాసంగి సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సంఘంలో రైతులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అనంతరం సంఘం కార్యకలాపాలపై సభకు వివరించారు. సంఘం సీఈఓ కె.వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పి.ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. మండలంలోని 18ఏండ్ల శారీరక అంగవైకల్యం గల విద్యార్థులు క్యాంపును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మూర్తి, సత్యనారాయణ, ఫిజియోథెరపీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఐఈఆర్‌పీలు సుధామణి, సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ నెల వైద్య సేవలపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్, చైల్డ్ హెల్త్ అధికారి రామకృష్ణ,

మోటకొండూర్, సెప్టెంబర్ 30 : యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఇమ్యూనైజేషన్, చైల్డ్ హెల్త్ అధికారి రామకృష్ణ, మండల వైద్యాధికారి విలియమ్ కేరీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలకు సంబంధించిన వైద్య సేవలపై సోమవారం వైద్య సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు పండ శాతం వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో రానున్న వయోజనుల బీసీజీ టీకాలను అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ వేయాలని ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పావని, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలి

• ఆదాయ పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ వెంకట్‌రెడ్డి

రాంరెడ్డి దంపతులకు సన్మానం చేసి వీడ్కోలు పలుకుతున్న ఉపాధ్యాయులు

మోత్కూరు, సెప్టెంబర్ 30 : ఉద్యోగ విరమణ తర్వాత ఉపాధ్యాయులు సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ తీపి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ మందడి రాంరెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ద్వారా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం దక్కుతుందన్నారు. విద్యార్థులకు ఇష్టమైన ఉపాధ్యాయుడిగా రాంరెడ్డి పేరు పొందారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ యానాల ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, ప్రముఖ కవి, గేయ రచయిత అభినయ శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ

నందనం గ్రామంలో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వి.సంతోష్‌కుమార్

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 30 : సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని నందనం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరులు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. సైబర్ మోసాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్ వంటి వాటిపై అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ గుట్ట ఆలయాన్ని పాత పద్ధతిలోనే ఉంచాలి

యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓ భాస్కర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న 9వ వార్డు కౌన్సిలర్, స్థానికులు

మోటకొండూర్, సెప్టెంబర్ 30 : యాదగిరిగుట్ట అనుబంధ ఆలయం పాత లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం దివ్యవాణిలో వివిధ రూపాలలో ప్రకటనను నిలిపివేశారని, తద్వారా ఆలయానికి భక్తుల రద్దీ తగ్గిపోయిందని 9వ వార్డు కౌన్సిలర్ అనిల్‌కుమార్ అన్నారు. పూర్వ గుట్ట ఆలయాన్ని పాత పద్ధతి ప్రకారమే ఉంచాలని కోరుతూ సోమవారం ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు స్థానికులతో కలిసి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ప్రకటనలు, వివిధ కార్యక్రమాలు చేస్తే పాత గుట్ట ఆలయానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఇందుకోసం సహకరించాలని యాదగిరిగుట్ట ఈఓను కోరారు.

హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్

• బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

మోటకొండూర